క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన

కేవీపల్లి : గ్యారంపల్లె కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.లక్ష్మిని పాఠశాల హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. 8వ తరగతి చదువుతున్న ఈమె ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది.

అవగాహన ర్యాలీ

తంబళ్లపల్లె : మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్ క్రాంతిపథం అధికారులు, మహిళా సభ్యులు, సంఘమిత్రలు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీయం గంగాధర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆడ పిల్లలను, మగపిల్లలను సమానంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు భవానిశంకర్, తులసి, హసీరాబేగం, సంఘమిత్రలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నిమ్మనపల్లె : కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ సోమవారం స్థానిక తహసీల్దార్ సి.ఆర్.మంజులకు వినతిపత్రం అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ, కూలీల జీవనోపాధి పెంపు తదితర అంశాలపై తెలిపినట్లు శోభ చెప్పారు. కార్యక్రమంలో మండల యూనియన్ సభ్యులు మంగమ్మ, నాగరత్న, మల్లికాబీ, అమ్మాజాన్, మైమూన్‌బీ, శారద లలిత తదితరులు పాల్గొన్నారు.

సంకల్పంతో సాగండి

తంబళ్లపల్లె : సమాజంలో సంకల్పంతో ముందుకు సాగాలని, ఆ బలంతో వైకల్యం చిన్నబోతుందని ఎంఈవో త్యాగరాజు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆటల పోటీలలో ప్రతిభ చూపిన పిల్లలకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఐఈఆర్‌టీ టీచర్లు రాధా, రేఖ, ఫిజియోథెరపిస్టు సరళ, టీచర్ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి

పీలేరు : సమష్టి కృషితో పీలేరు గ్రామ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేద్దామని జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎల్‌బీఎస్ రోడ్డు, అజంతామిట్ట ప్రాంతాల్లో వార్డుబాట కార్యక్రమం నిర్వహించారు. విస్తతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హుమయూన్, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డు మెంబరు రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మదనపల్లె : రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకులు కోనేటి దివాకర్ జన్మదినం సందర్భంగా సోమవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మచెరువుమిట్ట, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు.. సీఎస్ఐ ఓల్డ్‌ఏజ్ హోమ్, మార్కెట్‌యార్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్, కోనేటిదివాకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ముత్యాల మోహన్, పెద్దపాలెం రవిశంకర్, ఎస్.మస్తాన్, బురుజురెడ్డి ప్రసాద్, శ్రీకాంత్, రాయల్ సూర్య, నర్సీ, జనా, గంగాధర్, రవి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం

పీలేరు రూరల్ : మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో మహిళా సాధికారితా విభాగం, రేగళ్లు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ కవిత మాట్లాడుతూ మహిళలు రక్తహీనతకు గురి కాకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. హెచ్ఈ ఉషారాణి, సూపర్‌వైజర్లు మోహన్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

దోమల అంతం మనందరి బాధ్యత

పీలేరు : పలు రకాల వ్యాధులను వ్యాప్తి చేసే దోమల అంతం మనందరి బాధ్యత అని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం తలపులలో దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమకాటుతో డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపువ్యాధి, బోదకాలు, మలేరియా తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. హెచ్ఈ కొండయ్య, హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఏఎస్ఎం నాగవేణి, సీహెచ్‌వో కుముదా, ఆశ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, మూడు శుద్ధనీటి కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు

నిమ్మనపల్లె : తవళం గ్రామంలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. కార్తీకమాసంలో చివరి సోమవారం రోజున ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ఈఓ మంజుల ఆధ్వర్యంలో పూజారులు సంప్రదాయబద్ధంగా ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు, ముఖ్యఅతిథులతో కలిసి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్థానిక కుమారస్వామి నది నుంచి అభిషేక జలాలను మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం పవిత్రజలాలతో మూలవిరాట్టును అభిషేకించారు. అభిషేక జలంలో శ్రీ నేలమల్లేశ్వరస్వామి భక్తులకు ప్రత్యేక దర్శనం ఇచ్చారు. అనంతరం స్వామికి విశేషాలంకరణ చేసి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, రవి, శంకర, గంగాధర కుంభాభిషేక మహోత్సవాన్ని పర్యవేక్షించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. మదనపల్లె ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు.



అభిషేకజలంలో దర్శనమిస్తున్న శ్రీనేలమల్లేశ్వరస్వామి

వైభవంగా కేదారేశ్వరీ వ్రత పండుగలు

గుర్రంకొండ : మండలలోని పలు గ్రామాల్లో కేదారేశ్వరీ వ్రతపండుగలను (నోముల పండుగ)ను వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఈ పండుగను నిర్వహించారు. ఇందులో భాగంగా ఈరోజు చివరి సోమవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుర్రంకొండలోని శ్రీమంజునాథస్వామి ఆలయం, తరిగొండలో శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, ఎగువబురుజుపల్లె లోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం,ప్యారంపల్లెలో శ్రీ శివాలయంలలో మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి అత్తిరసాలను నైవేద్యంగా సమర్పించి నోముదారాలు,బంగారు నోములతో పండుగ నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు కేదారేశ్వరవ్రత కథను చదివి వినిపించి వ్రత మహత్యాన్ని అందరికి తెలియజేశారు.



గుర్రంకొండలోని శ్రీ మంజునాథస్వామి ఆలయంలో కేదారేశ్వరీ వ్రత పండుగను ఆచరిస్తున్న అర్చకులు, మహిళలు

శివనామస్మరణతో మారుమోగిన మల్లయ్యకొండ

తంబళ్లపల్లె : మల్లయ్యకొండలో వెలసిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున మల్లయ్యకొండ ఆలయాన్ని సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. గౌరమ్మగుట్టలో వెలసిన గౌరీదేవి ఆలయంలో పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు తలనీలాలు సమర్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ జరిగింది. మదనపల్లె వన్ డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి ఐదు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామసముద్రం మండలం శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

రామసముద్రం : కార్తీకమాసం చివరిరోజు కావడంతో సోమవారం శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. మండలంలోని లోకనాథేశ్వర, మూగవాడి పుండరీశ్వరస్వామి, బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి తదితర ఆలయాల్లో కార్తీకపూజలు నిర్వహించారు. గుంతయంబాడిలో చంద్రశేఖర్‌రావు రుద్రాభిషేకం చేయించి భక్తులకు అన్నదానం చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పెద్దతిప్పసముద్రం: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా చివరి సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయంలో పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో రుద్రహోమం,కార్తీక దీపోత్సవం, అన్నదానం కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అదే విధంగా టి.సదుం పంచాయతి సమీపంలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన సంఘమేశ్వరస్వామి ఆలయంలో, అంకిరెడ్డిపల్లి సమీపంలోని భైరవేశ్వరస్వామి ఆలయంలో జరిగిన లక్ష దీపార్చన అభిషేకాలు, హోమాలకు మండల వాసులే గాక కర్నాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ

బి.కొత్తకోట : ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ అలవడుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. సోమవారం బి.కొత్తకోటలో నిర్వహించిన కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శివపార్వతుల కళ్యాణోత్సవం వీక్షించారు. ఈ సందర్భంగా భక్తుల నుద్దేశించి మాట్లాడారు. నాగరికత సమాజంలో ప్రతిఒక్కరూ సంప్రదాయాలను పాటించాలన్నారు. ఆధ్యాత్మిక సన్మార్గంలో నడుపుతుందన్నారు. తద్వారా లక్ష్యాలను సాధించడానికి, జీవితంలో ఎదగడానికి దోహదం చేస్తుందన్నారు. ఆలయాల దర్శనం దైవ చింతనను పెంచుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం శ్రీమహావిష్ణుసేన ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి పూర్ణకుంభ స్వాగతం

హార్సిలీహిల్స్‌పై కార్తీక దీపోత్సవం

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి కార్తీకమాస దీపోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏనుగుమల్లమ్మ మూల విగ్రహం, ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ దీప ధ్వజస్తంభంపై నేతి దీపాన్ని వెలిగించారు.



హార్సిలీహిల్స్‌పై ఆలయ ధ్వజస్తంభంపై దీపోత్సవం

ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

కలికిరి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుట్టపాళెం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు. గుట్టపాళెం సచివాలయ పరిధిలోని మూరేవాండ్లపల్లి, నడిమి కంభంవారిపల్లి, దిగువ కంభంవారిపల్లి, డీకేవారిపల్లి హరిజనవాడ, సామకుంటవారిపల్లి, కర్రేవాండ్లపల్లి, ఎర్రకొండ్రెడ్డిగారిపల్లి, వైకేపల్లి హరిజనవాడ, యాదలవారిపల్లి, అచ్చిపిరెడ్డిగారిపల్లి, నల్లగుట్ట హరిజనవాడ, వాడావాండ్లపల్లి గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి అందిన లబ్ధితో కూడిన బుక్‌లెట్‌లను అందచేశారు. సమస్యలపై ప్రజలను విచారించారు. అధికశాతం రెవెన్యూ సమస్యలతో పాటు వివిధ విజ్ఞప్తులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. ఎలాంటి సిఫారసులు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను గడప వద్దకే తీసుకువస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, అద్దవారిపల్లి సర్పంచ్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

మదనపల్లె : ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే రాష్ట్రప్రభుత్వం జగనన్నకు చెబుదాం నిర్వహిస్తోందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మదనపల్లె డివిజన్ పరిధిలోని మండలాల్లో ప్రజాసమస్యలపై అర్జీలను స్వీకరించారు. సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా...వలసపల్లె పంచాయతీ గుంటివారిపల్లె ప్రాజెక్ట్ ముంపు గ్రామమైన నాయునివారిపల్లె కాలనీవాసులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇంటిపట్టాలు ఇవ్వాల్సిందిగా కోరారు. రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లె గ్రామదాఖలా సర్వేనెం.62–2 సెటిల్‌మెంట్ జాయింట్‌పట్టాలో వ్యవసాయభూమిలోకి రాకపోకలు జరిపేందుకు వీలుగా 3 అడుగుల దారి ఏర్పాటుచేసుకుంటే కొందరు అడ్డుగా రాతిబండలు వేస్తున్నారని, స్కెచ్‌లో చూపినవిధంగా దారి ఏర్పాటుకు సహకరించాల్సిందిగా లక్కవాసుదేవకుమార్‌రెడ్డి ఫిర్యాదుచేశారు. బసినికొండ గ్రామంలో వ్యవసాయభూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్‌విలువను అనుసరించి ఫీజు చెల్లించినప్పటికీ రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని పి.శంకరనారాయణరెడ్డి ఫిర్యాదుచేశారు.



జగనన్నకు చెబుదాంలో సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కె.ప్రమీల

మున్సిపాలిటీలో..

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 35వార్డుల్లోని ప్రజాసమస్యలపై సోమవారం చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కె.ప్రమీల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చంద్రాకాలనీ జహాచేనేతనగర్‌లో కాలువలు, నీటిపైప్‌లైన్ పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. కొళాయి కనెక్షన్ లేకున్నప్పటికీ తమపేరుమీద నీటి పన్ను వస్తోందని, అయితే మున్సిపల్ అధికారులు ప్రస్తుతం వచ్చిన బిల్లును చెల్లిస్తే తప్ప రద్దుచేయలేమంటున్నారని, దయచేసి తనకు న్యాయంచేయాల్సిందిగా రెడ్డిప్రభాకర్ అర్జీ సమర్పించారు. బీకే.పల్లె వైఎస్సార్ నగర్‌లో మౌలికవసతులు కల్పించాలని కోరారు. అమ్మచెరువుమిట్టలో రాకపోకలకు వీలుగా ప్రభుత్వం రోడ్డు వేస్తుంటే, మామిడితోట యజమానులు అడ్డుకుంటున్నారని, తమకు సౌకర్యంగా రోడ్డు తక్షణమే వేయాల్సిందిగా ఫిర్యాదుచేశారు. అగడ్డవీధిలో కొళాయిపైప్‌లైన్‌లోకి మురికినీరు వస్తోందని, సరిచేయాల్సిందిగా వినతిచేశారు. ప్రజలు సమస్యలపై సమర్పించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా చైర్‌పర్సన్, కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

దేశ చరిత్రలో రికార్డు ఆడుదాం ఆంధ్రా

కురబలకోట: దేశ చరిత్రలోనే ఆడుదాం ఆంధ్ర రికార్డు సృష్టించిందని ఎంపీపీ బి.దస్తగిరి అన్నారు. సోమవారం కురబలకోటలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పరికరాలను ఆయన సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఇంతవరకు ఇలా క్రీడా పోటీల కార్యక్రమం నిర్వహించిన రాష్ట్రం లేదన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల సంబరం నెలకొందన్నారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కూడా అందజేస్తారన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్ఫూర్తిని నింపేలా ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలన్నారు.



ఆడుదాం ఆంధ్ర పరికరాల పంపిణీ

అవగాహన కల్పించేందుకే యాత్ర

మదనపల్లె : కేంద్రప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలపై గ్రామీణస్థాయిలో అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్పయాత్రను చేపట్టినట్లు ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య అన్నారు. అంకిశెట్టిపల్లె, కొత్తపల్లె–1 పంచాయతీల్లో సంకల్పయాత్ర రథం సోమవారం పర్యటించింది. పంచాయతీ కార్యదర్శులు సంధ్య, షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో సర్పంచులు శరత్‌రెడ్డి, లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ రమణ, ఎంపీటీసీ దేవేంద్ర తదితరులు రథానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ భారతదేశాన్ని 2047 సంవత్సరానికి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలపాలనే ఉద్దేశంతో ప్రజలకు ఇచ్చిన సందేశాన్ని వినిపించారు. సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తమ తమ శాఖల ద్వారా కేంద్రప్రభుత్వం ప్రజలకు ఏ విధమైన సౌకర్యాలు కలిపిస్తున్నది ఆయా శాఖలకు చెందిన అధికారులు ప్రజలకు వివరించారు. ఉజ్వల పథకం కింద గ్యాస్‌స్టవ్‌లు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, పాల్గొన్న వారికి బహుమతులు అందించారు. పోషణ్‌అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీయస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్, వైద్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. సతత్ కృషి ఆక్టివిటీలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ పై విధానాన్ని రైతులకు ప్రదర్శించి చూపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణయ్యవర్మ, పూలనాగరాజ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లె–1లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య

వికసిత్ భారత్ యాత్ర

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి, కమ్మచెరువు సచివాలయాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు లక్ష్మీదేవి, చెరువు నరసమ్మ, శోభా, శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాజంపేట జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ హాజరై ప్రధానమంత్రి వీడియో సందేశాన్ని ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేసారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యార్థికి డిజి లాకర్ చాలా ముఖ్యం

గుర్రంకొండ : ప్రతి విద్యార్థికి డిజి లాకర్ చాలా ముఖ్యమని రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, తెలుగు జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు త్రినాథ్ అన్నారు. సోమవారం స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినిలకు సర్టిఫికెట్లు భద్రపరుచుకునేందుకుగాను ఫోల్డర్‌ఫైల్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఆంజనేయస్వామి మాలాధారణ గురువులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదవతరగతి విద్యార్థినిలకు ఫోల్డర్‌ఫైల్స్‌ను ఉచితంగా పంపిణీ చేసిన రీడోసంస్థ ప్రతినిధులు

మౌలిక వసతులు కల్పించాలి

మదనపల్లె : చిన్నతిప్పసముద్రం చెంచులక్ష్మి యానాది కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం, బీకేఎంయూ అన్నమయ్యజిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. సోమవారం చిన్నతిప్పసముద్రం సచివాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ చెంచులక్ష్మి యానాది కాలనీ వాసుల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలోని అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు వారి ఇళ్లలో చనిపోయిన కుటుంబసభ్యుల పరుపులు, చాపలు, దిండ్లు తదితర వ్యర్థాలను యానాదికాలనీలో తీసుకువచ్చి పడేస్తున్నారన్నారు. కాలనీకి ఆనుకుని ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ పాడయ్యాయని, ఊర్లో ఉన్న వారు అందులోనే మలవిసర్జన చేస్తుండటంతో కనీసం ఇళ్లలో ఉండలేకపోతున్నామని, భోజనం తినేందుకు సహించడం లేదని వాపోయారు. చిన్నపిల్లలకు వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి రోడ్లు, మురికికాలువలు ఏర్పాటుచేయాలన్నారు.



ధర్నా చేస్తున్న యానాదికాలనీ వాసులు

ఆర్టీసీతో సురక్షిత ప్రయాణం

పీలేరు రూరల్ : ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని డీఎం బి.కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సుండుపల్లె, సోమల రోడ్డులో ప్రయాణికులకు లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందజేశారు. సుండుపల్లె – పీలేరు రోడ్డులో పీలేరుకు చెందిన ఎ.అమితాబ్, మస్తాన్‌వలి, షంషాద్‌బీ.. సోమల – కలకడ మార్గంలో కలికిరికి చెందిన జమ్రుద్‌జాన్, కలకడకు చెందిన ఎం.బాలకృష్ణ, సోమలకు చెందిన మనోహర ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను మౌర్య కంటి ఆసుపత్రి సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, స్టేషన్ మేనేజర్లు రెడ్డెప్ప, బాబునాయక్, డాక్టర్ మౌర్య రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం కుమార్

ఘనంగా అయ్యప్ప అంబళం పూజ

మదనపల్లె సిటీ : స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో సోమవారం అయ్యప్ప స్వామి అంబళం పూజ ఘనంగా జరిగింది. అర్చకులు రమణరావు, పూలనాగరాజు ఆధ్వర్యంలో స్వామి విగ్రహంతో పాటు పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. మాలధారులు భజనలు చేశారు.

వైభవంగా గుంటి గంగమ్మ జాతర

వాల్మీకిపురం : చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లిలో సోమవారం శ్రీ గుంటి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు దీలుబోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి గుంటి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు పాడిపంటలు, సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, నల్లంకి నరసింహులు, ఫారుఖ్, శీనా, మెంబరు శీనా, చెంగల్ రెడ్డి, చంద్రశేఖర్, చిన్నప్ప, శ్రీరాములు, రమేష్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి

అవార్డుగ్రహీతలకు అభినందన

మదనపల్లె సిటీ : విజయవాడలోని తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థచే అవార్డులందుకున్న జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పఠాన్ మహమ్మద్‌ఖాన్, ఫణీంద్రస్వామి, షేక్ ముబారక్ బాషా, మోహన్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం స్థానిక డీవైఈఓ కార్యాలయంలో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ రమణ, షరాఫత్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న డీఈఓ పురుషోత్తం